Toli Velugu 28.01.26_Layout 1 1/28/2026 4:25 AM Page 1


# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..





నిజామాబాద్ | సంపుటి : 01 | సంచిక : 20 | పేజీలు : 4 | బుధవారం 28 జనవరి 2026 | వెల : 2/-

## ముగిసిన హల్వా వేడుక..

బడ్జెట్ ప్రవేశపెట్టేవరకు వాళ్లు బయటికి రారు..!



- కేంద్ర బడ్జెట్ 2026-27 తయారీలో ముగిసిన హల్వా వేడుక
- ఈ వేడుకతో ప్రారంభమైన బడ్జెట్ అధికారుల 'లాక్-ఇన్' పీరియడ్
- ఫిబ్రవరి 1న పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్
- మొబైల్ యాప్‌లోనూ అందుబాటులో ఉండనున్న బడ్జెట్ పత్రాలు
- ప్రసంగం పూర్తయ్యాకే యాప్‌లో బడ్జెట్ వివరాలు వెల్లడి

2

## ఈయూతో భారత్ చారిత్రాత్మక డీల్..

- పుంజుకున్న స్టాక్ మార్కెట్లు



భారత్-యూరోపియన్ యూనియన్ వాణిజ్య ఒప్పందంతో పెరిగిన సెంటిమెంట్

భారీ ఒడుదొడుకుల మధ్య లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

126 పాయింట్ల లాభంతో 25,175 వద్ద స్థిరపడిన నిఫ్టీ

మెటల్ షేర్లలో భారీ కొనుగోళ్లు, ఆటో షేర్లలో అమ్మకాల ఒత్తిడి

2

# మేడారం జాతరకు సర్వం సిద్ధం

- నాలుగు రోజుల పాటు జరగనున్న మేడారం సమ్మక్క-సారక్క మహాజాతర ప్రారంభం
- ఈ వేడుకకు రెండు కోట్ల మందికి పైగా భక్తులు హాజరవుతారని అంచనా
- రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రూ. 251 కోట్లతో భారీ ఏర్పాట్లు
- భక్తుల కోసం ప్రత్యేక బస్సులు, రైళ్లు.. అందుబాటులో హెలికాప్టర్ సేవలు!
- భద్రత కోసం 13,000 మంది పోలీసుల మోహరింపు, డ్రోన్లతో నిఘా



డెస్క్, జనవరి 27 (తొలివెలుగు) : తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర, మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర రేపు (జనవరి 28) ప్రారంభం కానుంది. ములుగు జిల్లాలోని మేడారం గ్రామంలో జరిగే ఈ నాలుగు రోజుల వేడుకకు దేశం నలుమూలల నుంచి సుమారు రెండు కోట్లకు పైగా భక్తులు తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్‌కు దాదాపు 240 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గిరిజన పుణ్యక్షేత్రం ఇప్పటికే జనసంద్రంగా మారింది.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా సహా పలు రాష్ట్రాల నుంచి గిరిజనులు, గిరిజనేతరులు ఈ జాతరకు పోటెత్తుతున్నారు. ఇప్పటికే గత కొద్ది రోజులుగా దాదాపు 10 లక్షల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. వనదేవతలైన సమ్మక్క, సారలమ్మల వీరత్వాన్ని, త్యాగాన్ని స్మరించుకుంటూ రెండేళ్లకోసారి ఈ జాతరను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు.

### ప్రభుత్వం భారీ ఏర్పాట్లు

ఈ ఏడాది జాతర కోసం రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 251 కోట్లు ఖర్చు చేసింది. 21 శాఖలకు చెందిన 42,000 మందికి పైగా అధికారులు, సిబ్బందిని, 2000 మంది ఆదివాసీ వాలంటీర్లను భక్తుల సేవ కోసం నియమించారు. భద్రతా ఏర్పాట్లలో భాగంగా 13,000 మంది పోలీసులను మోహరించారు. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత డ్రోన్లతో జాతరను పర్యవేక్షిస్తున్నారు. 1,418 ఎకరాల్లో 42 పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. జంపన్న వాగు వద్ద 200 మంది గజ ఈతగాళ్లను, 30 వైద్య శిబిరాల్లో 5,192 మంది వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. పారిశుద్ధ్యం కోసం 5,000 మంది కార్మికులు, 5,700 తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు.

భక్తుల రవాణా కోసం టీజీఎస్ఆర్టీసీ 4,000 ప్రత్యేక బస్సులను, దక్షిణ మధ్య రైల్వే 28 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. పర్యాటక శాఖ హనుమకొండ నుంచి మేడారానికి హెలికాప్టర్ సేవలను కూడా అందిస్తోంది. రౌండ్ ట్రిప్‌తో కూడిన వీఐపీ దర్శనానికి రూ. 35,999/- జాతర ఏరియల్ వ్యూ....

2

## తెలంగాణలో మోగిన పురభేరి

- 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల
- ఫిబ్రవరి 11న పోలింగ్, 13న కౌంటింగ్
- తక్షణమే రాష్ట్రంలో అమల్లోకి ఎన్నికల కోడ్
- నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ
- ఫిబ్రవరి 16న మేయర్, డిప్యూటీ మేయర్, ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక




డెస్క్, జనవరి 27 (తొలివెలుగు) తెలంగాణ రాష్ట్రంలోని 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల కోసం రేపటి నుంచి ఈ నెల 30 వరకు నామినేషన్లను స్వీకరించనున్నట్లు తెలిపారు. జనవరి 31న నామినేషన్ల పరిశీలన, ఫిబ్రవరి 3వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందని తెలిపారు. ఫిబ్రవరి 11న పోలింగ్, 13న ఓట్ల లెక్కింపు ఉంటుందని వెల్లడించారు. వచ్చే నెల 16వ తేదీన కార్పొరేషన్‌లలో మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపాలిటీల్లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలు పరోక్ష పద్ధతిలో జరుగుతాయని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో 52 లక్షల 43 వేల మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 130 మున్సిపాలిటీలు ఉంటే వివిధ కారణాలతో 116 మున్సిపాలిటీలలో మాత్రమే ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. కంట్రోల్ రూం నుంచి ఓటింగ్ ప్రక్రియను మానిటరింగ్ చేయనున్నట్లు తెలిపారు. రూ.50 వేలకు మించి నగదుకు లెక్క చూపవలసి ఉంటుందని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరుగుతాయని తెలిపారు.

## డిప్యూటీ సీఎం ని మంత్రులు కలవకూడదా..?

### మంత్రులతో కీలక భేటీ పై స్పందించిన మల్లు భట్టివిక్రమార్క

- విదేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- భట్టివిక్రమార్కతో మంత్రులు సమావేశం
- ఉప ముఖ్యమంత్రితో మంత్రులు సమావేశం కాకూడదా అని భట్టివిక్రమార్క ప్రశ్న
- సీఎం అందుబాటులో లేనందున తనతో చర్చించేందుకు వచ్చారని స్పష్టీకరణ



డెస్క్, జనవరి 27 (తొలివెలుగు) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనలో ఉండగా, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ నిన్న రాత్రి సమావేశం కావడం తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ భేటీపై మల్లు భట్టి విక్రమార్క స్పందించారు. ఉప ముఖ్యమంత్రితో మంత్రులు సమావేశం కాకూడదా అని ఆయన ప్రశ్నించారు. మంత్రులు తనతో భేటీ కావడం సాధారణ విషయమేనని ఆయన స్పష్టం చేశారు. ఇది పాలనాపరమైన అంశాలపై జరిగిన సమావేశమని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి అందుబాటులో లేనందున మంత్రులు ఉప ముఖ్యమంత్రిగా తనతో చర్చించేందుకు వచ్చారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు అందరూ కలిసి ఒక ఉమ్మడి కుటుంబంలా పనిచేస్తున్నామని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలో ఉన్న సమయంలో ఈ భేటీ జరగడం చర్చకు దారి తీసిందని మీడియా ప్రతినిధి ప్రశ్నించగా, మల్లు భట్టి విక్రమార్క స్పందిస్తూ, కొందరు పిచ్చివాళ్లు ఏవేవో మాట్లాడుతుంటారని, వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు..

### సిట్ ఎదుట విచారణకు హాజరైన సంతోష్ రావు

- మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరైన సంతోష్ రావు
- జూబ్లీహిల్స్‌లోని ఏసీపీ కార్యాలయంలో ప్రశ్నిస్తున్న అధికారులు
- ఇప్పటికే కేటీఆర్, హరీశ్ రావును విచారించిన పోలీసులు



డెస్క్, జనవరి 27 (తొలివెలుగు) : తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు జోగినపల్లి సంతోష్ రావు మంగళవారం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఎదుట విచారణకు హాజరయ్యారు. జూబ్లీహిల్స్‌లోని ఏసీపీ కార్యాలయంలో అధికారులు ఆయనను ప్రశ్నిస్తున్నారు. సంతోష్ రావుకు నిన్న సిట్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన ఈరోజు మూడు గంటలకు విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో ఇటీవలే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావులను ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు విచారించారు.

## రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన కేటీఆర్



సింగరేణి బొగ్గు కుంభకోణంపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్

కుంభకోణాన్ని ఆధారాలతో బయటపెట్టడంతో కాంగ్రెస్‌లో వణుకు ప్రారంభమైందన్న కేటీఆర్

సింగరేణి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వంశ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్

2

## ఒంటినిండా విషం నింపుకుని కాంగ్రెస్ పట్ల విషం చిమ్ముతున్నారు - పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- బీఆర్ఎస్ నేతలపై పొంగులేటి ఫైర్
- అధికారం కోల్పోయిన తర్వాత అచ్చోసిన ఆంబోతుల్లా రంకెలు వేస్తున్నారని మండిపాటు
- తమ ప్రభుత్వం ప్రజల కోసమే పని చేస్తోందన్న మంత్రి



డెస్క్, జనవరి 27 (తొలివెలుగు) : బీఆర్ఎస్ నేతలు అధికారం కోల్పోయిన తర్వాత అచ్చోసిన ఆంబోతుల్లా రంకెలు వేస్తూ, ఒంటినిండా విషం నింపుకుని కాంగ్రెస్ పట్ల విషం చిమ్ముతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజల శ్రేయస్సు కోసం ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. గత ప్రభుత్వంలో రూపొందిన మంచి పథకాలను కొనసాగిస్తూ ముందుకు సాగుతున్నామని వివరించారు. రాబోయే ఏప్రిల్ నెలలో మళ్లీ కొత్త ఇళ్లు మంజూరు చేస్తామని, ఆ తర్వాత మరో మూడు దఫాలుగా ఇళ్లు మంజూరీ చేస్తామని ప్రకటించారు. ప్రజలు గతంలో ఏం జరిగిందో గుర్తుంచుకోవాలని, ప్రస్తుత ప్రభుత్వం ప్రజల కోసమే పని చేస్తోందని స్పష్టం చేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కోరిక మేరకు నియోజకవర్గానికి రూ.1.30 కోట్ల నిధులు మంజూరు చేశానని ఎంపీ కడియం కావ్య స్పష్టం చేశారు. నియోజకవర్గ కేంద్ర అభివృద్ధికి తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని ఆమె అన్నారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, వర్ధన్నపేటలో మూడుసార్లు ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రిగా పని చేసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎవరినీ ఎదగనీయకుండా ధృతరాష్ట్రుని పాలన చేశాడని విమర్శించారు. పాలకుర్తిలో ప్రజలు తరిమికొట్టిన తర్వాత ఇప్పుడు వర్ధన్నపేట మునిసిపాలిటీపై అవాకులు, చవాకులు పేలుతున్నారని దుయ్యబట్టారు.

## నేను, రఘునందన్ రావు కలిశామంటే.. బిఆర్ఎస్ గల్లంతే..! - ధర్మపురి అరవింద్



తామిద్దరూ కలిస్తే బీఆర్ఎస్ గల్లంతవుతుందన్న నిజామాబాద్ ఎంపీ

బీజేపీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందన్న ధర్మపురి అరవింద్

బీఆర్ఎస్ ప్రభావం ఉంటుందనుకోవడం లేదన్న రఘునందన్ రావు

2

Toli Velugu 28.01.26_Layout 1 1/28/2026 4:25 AM Page 2



# ఐదు గంటల పాటు
## జోగినపల్లి సంతోష్ రావు విచారణ

- ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ మాజీ ఎంపీని ప్రశ్నించిన సిట్
- మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రశ్నించిన సిట్
- ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ప్రభాకర్ రావు నియామకం నిర్ణయం ఎవరిదని ప్రశ్నించిన సిట్




డెస్క్, జనవరి 27 (తొలివెలుగు) : బీఆర్ఎస్ నాయకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్ రావును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సుదీర్ఘంగా విచారించింది. సిట్ విచారణ కొద్దిసేపటి కిందట ముగిసింది. సాయంత్రం మూడు గంటలకు ప్రారంభమైన విచారణ ఐదు గంటల పాటు కొనసాగింది. సిట్ అధికారులు సంతోష్ రావు వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ప్రభాకర్ రావు నియామకం నిర్ణయం ఎవరిదని ప్రశ్నించినట్లు సమాచారం. ఫోన్



ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించి ఆధారాలను ముందుంచి సిట్ ఆయనను ప్రశ్నించినట్టు తెలుస్తోంది. ప్రభాకర్ రావుకు ఇంటెలిజెన్స్ చీఫ్, ఎస్ఐబీ చీఫ్ బాధ్యతలు అప్పగించడంలో నిర్ణయం, ఆదేశాలు ఎవరు ఇచ్చారనే అంశంపై సంతోష్ రావును సిట్ ప్రశ్నించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ఇదివరకే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావును విచారించిన విషయం విదితమే.

# ఈయూతో భారత్ చారిత్రాత్మక డీల్..
## - పుంజుకున్న స్టాక్ మార్కెట్లు

మొదటిపేజీ తరువాయి..
డెస్క్, జనవరి 27 (తొలివెలుగు) : దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నాడు లాభాలతో ముగిశాయి. రోజంతా తీవ్ర ఒడుదొడుకులకు లోనైనప్పటికీ, భారత్–యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య కీలక వాణిజ్య ఒప్పందం కుదరడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడింది. దీంతో సూచీలు చివరికి సానుకూలంగా స్థిరపడ్డాయి. ట్రేడింగ్ ముగిసే సమ–యానికి నిఫ్టీ 126.75 పాయింట్లు లాభపడి 25,175.40 వద్ద నిలిచింది. సెన్సెక్స్ కూడా 319.78 పాయింట్లు పెరిగి 81,857.48 వద్ద ముగిసింది.

భారత్, ఈయూ మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం మార్కెట్లకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. ఈ డీల్ ప్రకారం, 2032 నాటికి భారత్‌కు ఈయూ నుంచి వస్తువుల ఎగుమతులు రెట్టింపు అవుతాయని అంచనా. భారత్‌కు వచ్చే దాదాపు 96.6 శాతం యూరోపియన్ వస్తువులపై సుంకాలను తగ్గించడం లేదా పూర్తిగా తొలగించడం జరుగుతుంది. అదే సమయంలో, భారత్ నుంచి దిగుమతి చేసుకునే 99.5 శాతం వస్తువులపై ఈయూ సుంకాలను తగ్గించనుంది. ఇది ఇరుపక్షాల మధ్య వాణిజ్య అవకాశాలను గణనీయంగా పెంచుతుందని భావిస్తున్నారు. కాగా, మార్కెట్లలో ఇవాళ రోజంతా అస్థిరత కనిపించింది. మహీంద్రా అండ్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐటీసీ, మారుతీ సుజుకీ వంటి హెవీ వెయిట్ షేర్లు 4 శాతం వరకు నష్టపోయి మార్కెట్లపై ఒత్తిడి పెంచాయి. మరోవైపు, యాక్సిస్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, ఎన్టీపీసీ, టెక్ మహీంద్రా, టాటా స్టీల్, ఎస్బీఐ వంటి షేర్లలో కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. ఈ షేర్లు 5 శాతం వరకు లాభపడి సూచీలకు మద్దతుగా నిలిచాయి.

రంగాల వారీగా చూస్తే నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 3 శాతం దూసుకెళ్లింది. అయితే, నిఫ్టీ మీడియా 1.4 శాతం, నిఫ్టీ ఆటో 0.9 శాతం చొప్పున నష్టపోయాయి. బ్రాడర్ మార్కెట్లలో నిఫ్టీ మిడ్‌క్యాప్ 100, స్మాల్‌క్యాప్ 100 సూచీలు కూడా లాభాల్లోనే ముగిశాయి. నిఫ్టీకి 25,000 వద్ద కీలక మద్దతు ఉందని, దాని దిగువకు పడితే అమ్మకాల ఒత్తిడి పెరగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస–్తుతం ఇన్వెస్టర్లు అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల నిర్ణయం, రాబోయే కేంద్ర బడ్జెట్ కోసం ఎదురుచూస్తున్నారని విశ్లేషకులు తెలిపారు.

# ముగిసిన హల్వా వేడుక..
## బడ్జెట్ ప్రవేశపెట్టేవరకు వాళ్లు బయటికి రారు..!

మొదటిపేజీ తరువాయి..
డెస్క్, జనవరి 27 (తొలివెలుగు) : కేంద్ర బడ్జెట్ 2026–27 రూపకల్పన ప్రక్రియ చివరి అంకానికి చేరుకుంది. ఏటా బడ్జెట్ తయారీలో చివరి ఘట్టానికి సూచనగా నిర్వహించే సంప్రదాయ 'హల్వా వేడుక' మంగళవారం నాడు ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో ఉన్న బడ్జెట్ ప్రెస్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి హాజ–రయ్యారు. బడ్జెట్ రూపకల్పన ప్రక్రియ ముగింపు దశకు వచ్చిందని, ఇక ప్రింటింగ్ ప్రారంభమవుతుందని ఈ వేడుక సంకేతాన్నిస్తుంది. ఈ వేడుక ముగిసిన వెంటనే బడ్జెట్ రూపకల్పనలో పాలుపంచుకున్న కీలక అధికారులు 'లాక్–ఇన్' పీరియడ్‌లోకి వెళతారు. ఫిబ్రవరి 1న పార్లమెంటులో బడ్జెట్‌ను ప్రవేశపెట్టే వరకు వీరంతా బయటి ప్రపంచంతో ఎలాంటి సంబంధాలు లేకుండా పూర్తి ఏకాంతంగా గడుపుతారు. ఫోన్, ఇంటర్నెట్ వంటి సదు–పాయాలకు కూడా దూరంగా ఉంటారు. బడ్జెట్‌కు సంబంధించిన అత్యంత కీలకమైన, రహస్య సమాచారం బయటకు పొక్కకుండా ఉండేందుకు దశాబ్దాలుగా ఈ కఠిన నిబంధనను పాటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, సహాయ మంత్రి పంకజ్ చౌదరి అధికారులకు హల్వాను వడ్డించి, శుభాకాంక్షలు తెలిపారు. హల్వా వేడుక అనంతరం నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రెస్‌ను సందర్శించారు. అక్కడ బడ్జెట్ పత్రాల ముద్రణకు సంబంధించిన తుది ఏర్పాట్లను సమీక్షించారు. బడ్జెట్ రూపకల్పన, ముద్రణ పనుల్లో నిమగ్నమైన సిబ్బందికి, అధికారుల బృందానికి ఆమె ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని వివిధ విభాగాల కార్యదర్శులు, బడ్జెట్ తయారీ ప్రక్రియతో సంబంధం ఉన్న ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

### డిజిటల్ రూపంలో బడ్జెట్ పత్రాలు

గత కొన్నేళ్లుగా అనుసరిస్తున్న విధానాన్ని కొనసాగిస్తూ, ఈసారి కూడా బడ్జెట్ పత్రాలన్నీ ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేందుకు డిజిటల్ రూపంలో విడుదల చేయనున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. వార్షిక ఆర్థిక నివేదిక, పద్దుల కేటాయింపులు, ఆర్థిక బిల్లు వంటి కీలక పత్రాలన్నీ 'యూనియన్ బడ్జెట్ మొబైల్ యాప్' లోలభిస్తాయి. పార్లమెంటు సభ్యులు, సాధారణ ప్రజలు ఈ యాప్ ద్వారా బడ్జెట్ వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు. ఈ యాప్ ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫామ్‌లపై అందుబాటులో ఉంది. అలాగే, indiabudget.gov.in వెబ్‌సైట్ ద్వారా కూడా పత్రాలను యాక్సెస్ చేయవచ్చు. అయితే, ఫిబ్రవరి 1న పార్లమెంటులో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగం పూర్తయిన తర్వాతే ఈ పత్రాలు యాప్‌లో, వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# మేడారం జాతరకు సర్వం సిద్ధం

మొదటిపేజీ తరువాయి..
కోసం ఒక్కొక్కరికి రూ. 4,800 చొప్పున ఛార్జీలను నిర్ణయించారు.

### జాతర నేపథ్యం, సంప్రదాయాలు

కాకతీయ పాలకుల పన్నుల విధానాన్ని ఎదిరించి పోరాడిన గిరిజన వీరవనితలు సమ్మక్క, ఆమె కుమార్తె సారక్క (సారలమ్మ)ల శౌర్యాన్ని స్మరించుకుంటూ ఈ జాతరను నిర్వహిస్తారు. కోయ తెగకు చెందిన ఈ తల్లీకూతుళ్లను గిరిజనులు దేవతలుగా కొలుస్తా–రు. పోరాటంలో అలసిపోయిన సమ్మక్క చిలుకలగుట్ట వైపు వెళ్లి అదృశ్యమయ్యిందని, ఆమె కోసం వెతికిన గిరిజనులకు ఓ వెదురు చెట్టు కింద కుంకుమ భరిణె మాత్రమే లభించిందని స్థానిక కథనం. అప్పటి నుంచి రెండేళ్లకోసారి గిరిజన పూజారులు వెదురు వనంలో ప్రత్యేక పూజలు చేసి, కుంకుమ భరిణె, ఎర్రటి వస్త్రం చుట్టిన వెదురు కర్రను సమ్మక్క ప్రతిరూపంగా భావించి గద్దెల వద్దకు తీసుకువస్తారు. అంతకుముందు రోజు కన్నేపల్లి నుంచి సారలమ్మను తీసుకువచ్చి గద్దెలపై ప్రతిష్ఠించడంతో జాతర అధికారికంగా మొదలవుతుంది. భక్తులు తమ బరువుకు సమానమైన బెల్లాన్ని (బంగారం) అమ్మవార్లకు సమర్పిస్తారు. జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించడం ఇక్కడి ముఖ్యమైన సంప్రదాయం.

# రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై
## గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన కేటీఆర్

మొదటిపేజీ తరువాయి..
డెస్క్, జనవరి 27 (తొలివెలుగు) : సింగరేణి బొగ్గు కుంభకోణంపై సీబీఐతో విచారణ జరిపించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసి విజ్ఞప్తి చేశారు. కేటీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం ఈరోజు గవర్నర్‌ను కలిసి సింగరేణిలో బొగ్గు కుంభకోణం జరిగిందని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసింది. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. సింగరేణిలో దోపిడీ అంశంపై గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చామని, ఆధారాలతో బయట పెట్టినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీలో వణుకు మొదలైందని అన్నారు. కుంభకోణాన్ని బహిర్గతం చేశాక అధికార పార్టీ గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని అన్నారు. అందుకే ప్రజల దృష్టిని మరల్చేందుకు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తెరపైకి తీసుకువచ్చారని ఆరోపించారు. ఫుట్‌బాల్ ఆటకు రూ.10 కోట్ల సింగరేణి నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. సీఎం అంటే కోల్ మాఫియా నాయకుడిగా సింగరేణి కార్మికులు భావించే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. సింగరేణి టెండర్లలో పారదర్శకత లేదని అన్నారు. సింగరేణి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో కీలక వ్యక్తి సృజన్ రెడ్డి ముఖ్యమంత్రికి బావమరిదేనా, కాదా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణి కుంభకోణాన్ని అడ్డుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు చెప్పారు. రేవంత్ రెడ్డి సోదరులకు ఇదివరకే దోచుకున్నది సరిపోక, హిల్ట్ పాలసీ పేరుతో హైదరాబాద్ లోని పారిశ్రామిక వాడల్లోని రూ.5 లక్షల కోట్ల విలువైన 9,200 ఎకరాల భూములను కొల్లగొట్టే ప్రయత్నం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి కుంభకోణం, హిల్ట్ పాలసీ వంటి ప్రజాధనాన్ని కొల్లగొట్టే ప్రయత్నాలను అడ్డుకోవాలని గవర్నర్‌ను కోరామని అన్నారు.

# నేను, రఘునందన్ రావు కలిశామంటే..
## బిఆర్ఎస్ గల్లంతే..! - ధర్మపురి అరవింద్

మొదటిపేజీ తరువాయి..
డెస్క్, జనవరి 27 (తొలివెలుగు) : మెదక్ ఎంపీ రఘునందన్ రావుతో తాను కలిస్తే బీఆర్ఎస్ గల్లంతవడం ఖాయమని నిజామాబాద్ ఎంపీ, బీజేపీ నేత ధర్మపురి అరవింద్ అన్నారు. మున్సిపల్ ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని, మెజారిటీ స్థానాలు తామే గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఏ పార్టీలోనైనా గ్రూపు రాజకీయాలు, విభేదాలు సహజమేనని ధర్మపురి అరవింద్ అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ పార్టీలో కుటుంబ



గొడవలు, కాంగ్రెస్ పార్టీలో మంత్రుల కొట్లాటలను చూస్తూనే ఉన్నామని ఆయన అన్నారు. తమ పార్టీలో విభేదాలు లేవని, భిన్నాభిప్రాయాలు మాత్రమే ఉంటాయని, అనంతరం అధిష్ఠానం నిర్ణయం ప్రకారం నడుచుకుంటామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల కోసం ఇన్‌ఛార్జులను ఎప్పుడో రంగంలోకి దింపామని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఒకటి రెండు రోజుల్లో అభ్యర్థులను కూడా ప్రకటిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో, కార్పొరేషన్‌లలో తమకు కాంగ్రెస్ పార్టీతోనే పోటీ ఉంటుందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ప్రభావం ఉంటుందని తాము అనుకోవడం లేదని, గెలుపు కోసం అందరం కలిసి పనిచేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

Toli Velugu 28.01.26_Layout 1 1/28/2026 4:25 AM Page 3



## ప్రత్యేక గ్రీవెన్స్, ఉద్యోగవాణి కార్యక్రమాల రద్దు

**- జిల్లా కలెక్టర్ యం. హనుమంతరావు**



యాదాద్రి భువనగిరి, జనవరి 27 (తొలివెలుగు): తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్‌ను 27 జనవరి 2026న విడుదల చేసిన నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చినట్లు జిల్లా కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతి గురువారం నిర్వహించే ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం, ఉద్యోగవాణి కార్యక్రమం రద్దు చేసినట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించేందుకు కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు.

## ఉద్యమకారులను గుర్తించకుంటే పతనం తప్పదు - సంగిశెట్టి క్రిస్టఫర్



భువనగిరి, జనవరి 27 (తొలివెలుగు): రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను లెక్కచేయకుండా పోరాటం చేసిన ఉద్యమకారులను గుర్తించకుంటే ప్రభుత్వానికి పతనం తప్పదని మలిదశ ఉద్యమకారుడు, టీయూ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ హెచ్చరించారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో బుల్లెట్ గాయాలు, పోలీసుల లాఠీ దెబ్బలు భరించి జైలు జీవితాలు గడిపిన ఉద్యమకారులు నేడు నిర్లక్ష్యానికి గురవుతున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమకారులు రోడ్లపై ఉంటే, రాష్ట్రాన్ని వ్యతిరేకించిన వారు భోగాలు అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల త్యాగాలు చరిత్రలో నిలిచిపోతాయని తెలిపారు. ఉద్యమకారులను గుర్తించకపోతే వారి ఉసురు తగులుతుందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

## మున్సిపల్ ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులను గెలిపించాలి..

**- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య**




చౌటుప్పల్, జనవరి 27 (తొలివెలుగు): ఫిబ్రవరి 11న జరిగే మున్సిపాలిటీ ఎన్నికల్లో సీపీఐ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య అన్నారు. మంగళవారం చౌటుప్పల్ మున్సిపల్ కార్యదర్శి పగిల్ల మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో నీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుధ్యం, సీసీ రోడ్ల వంటి మౌలిక వసతుల కోసం సీపీఐ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు నిర్వహించినట్లు తెలిపారు. కమ్యూనిస్టులు ప్రజా సమస్యల పరిష్కారానికి రాజీలేకుండా పోరాడతారని అన్నారు. ఆర్థిక బలాన్ని నమ్ముకొని పోటీ చేసే వారిని ప్రజలు గమనించాలని, ప్రజల గొంతుగా పనిచేసే సీపీఐ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి, కొండూరి వెంకటేష్, టంగుటూరి రాములు, బద్దుల సుధాకర్, దాసరి అంజయ్య, బోయ మంకులు, దాసరి మనోహర్, గంగనాబోయిన నర్సింహ్మ, గుండెబోయిన భాస్కర్, నీళ్ల బిక్షపతి, దాసరి కృష్ణ, బేధరకోట యాదయ్య పాల్గొన్నారు.

## మద్యపాన నిషేధానికి గ్రామ ప్రజల తీర్మానం

వలిగొండ, జనవరి 27 (తొలివెలుగు): వలిగొండ మండల పరిధిలోని ముద్దాపురం గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధానికి గ్రామ ప్రజలు తీర్మానం చేశారు. 26 జనవరి గణతంత్ర దినోత్సవం సందర్భంగా గ్రామ సర్పంచ్, పాలకవర్గం, గ్రామస్తులు, మహిళా సంఘాలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి ఈ నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలో బెల్ట్ షాపులు, హోటళ్ల ద్వారా మద్యం విక్రయం పూర్తిగా నిషేధించాలని తీర్మానించారు. తీర్మానాన్ని ఉల్లంఘించి మద్యం విక్రయం చేపట్టిన వారిపై గ్రామ ప్రజల నిర్ణయం ప్రకారం రూ.50 వేల జరిమానా విధించనున్నట్లు వెల్లడించారు. మద్యపానం కారణంగా గ్రామంలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని, ప్రమాదాలకు గురై ప్రాణనష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులకు చెక్ పెట్టాలనే ఉద్దేశంతో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలుకు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.



కార్యక్రమంలో సర్పంచ్ సామ సరస్వతి రాంరెడ్డి, ఉపసర్పంచ్ బడక శ్రీనివాస్, వార్డు సభ్యులు గూడూరు సుగుణమ్మ, సామ రాజేందర్ రెడ్డి, సామల చైతన్య, బత్తుల భిక్షం, వాకిటి కొండల్ రెడ్డి, జక్క వెంకట్ రెడ్డి, సామ రాంరెడ్డి, గుర్రం కిష్టారెడ్డి, యం నవీన్, సునీత, పద్మ, బుచ్చమ్మ, పూలమ్మ, ఎస్ వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

## ఫుడ్ సేఫ్టీ అధికారుల విధులకు ఆటంకం


- అసభ్య పదజాలంతో దూషణ
- షాప్ యజమాని కుటుంబంపై కేసు నమోదు



వలిగొండ, జనవరి 27 (తొలివెలుగు): మండల కేంద్రంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్వహించిన తనిఖీల సమయంలో అధికారుల విధులకు ఆటంకం కలిగించిన ఘటన చోటుచేసుకుంది. జిల్లా ఇన్‌చార్జి ఫుడ్ సేఫ్టీ అధికారి డాక్టర్ శివశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో కిరాణా షాపులు, హోటళ్లలో తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ సంఘటన జరిగింది. ఫుడ్ సేఫ్టీ అధికారి తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని మాతాజీ కిరాణం షాపు తనిఖీ అనంతరం మణికంఠ కిరాణాల షాపులో ఆహార పదార్థాల తనిఖీ కోసం వెళ్లగా షాపు యజమాని నాగభూషణం, ఆయన భార్య లలిత, కుమారుడు మణికంఠలు దుర్భాషలాడుతూ అధికారుల విధులకు ఆటంకం కలిగించారు. విచక్షణారహితంగా ప్రవర్తిస్తూ తనిఖీలను అడ్డుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన అనంతరం వారి సూచనల మేరకు స్థానిక పోలీసుల సహకారంతో తనిఖీలు కొనసాగించినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో గడువు ముగిసిన ప్యాకెట్ ఆహార పదార్థాలు, అధిక పరిమాణంలో రంగులు, రసాయనాలు ఉపయోగించిన ఆహార పదార్థాలు గుర్తించి శాంపిళ్లు సేకరించినట్లు తెలిపారు. తనిఖీల సమయంలో అధికారుల మొబైల్ ఫోన్‌ను లాక్కుని ధ్వంసం చేయడానికి ప్రయత్నించడం, మూకుమ్మడిగా దాడికి యత్నించిన ఘటనలపై సంబంధిత ముగ్గురు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఫుడ్ సేఫ్టీ అధికారి తెలిపారు. అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## మున్సిపాలిటీ ఎన్నికలకు సన్నద్ధంగా ఉండాలి

**- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్**





యాదాద్రి భువనగిరి, జనవరి 27 (తొలివెలుగు): మున్సిపాలిటీ ఎన్నికలను సమర్థవంతంగా, శాంతియుతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని జిల్లాలు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, మున్సిపల్ కమిషనర్లతో మున్సిపాలిటీ ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాణి కుముదిని మాట్లాడుతూ.. రాష్ట్రంలో 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన వెంటనే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వస్తుందని తెలిపారు. ఎన్నికల నియమ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. పోలింగ్ బూతులలో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీలలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ.. పంచాయితీ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించామని గుర్తు చేశారు. మున్సిపల్ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని సమర్థవంతంగా అమలు చేయాలని, విధుల్లో ఎలాంటి అలసత్వానికి తావు లేకుండా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల విధులకు తగినంత సిబ్బందిని నియమిసా-మని వెల్లడించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ హనుమంత రావు, ఎస్పీ అక్షాంష్ యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, అడిషనల్ డీసీపీ లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హనుమంత రావు మున్సిపల్ కమిషనర్లతో మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ఎన్నికల ప్రవర్తన నియమావళికి అనుగుణంగా ఎన్నికలు నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ జి. వెంకటరామ్ రెడ్డి, కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

Toli Velugu 28.01.26_Layout 1 1/28/2026 4:25 AM Page 4



# ప్రతి రైతుకూ ఒకే గుర్తింపు.. 'ఫార్మర్ ఐడీ' రిజిస్ట్రేషన్ తప్పనిసరి..

## - సర్పంచ్ జువ్వి నర్సింహ్మా




చౌటుప్పల్, జనవరి 27 (తొలివెలుగు ): వ్యవసాయ భూమి కలిగిన ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ ఐడీ నమోదు చేయించుకోవాలని ధర్మోజిగూడెం గ్రామ సర్పంచ్ జువ్వి నర్సింహ్మా తెలిపారు. చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం గ్రామంలో ఎల్లగిరి వ్యవసాయ విస్తరణ అధికారి చాడ లక్ష్మణ్ ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ జువ్వి నర్సింహ్మా మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రాజెక్టును ప్రారంభించినట్లు తెలిపారు. రెవెన్యూ శాఖ ద్వారా సేకరించిన భూమి యాజమాన్య వివరాలను ఆధార్ కార్డుతో అనుసంధానం చేసి ప్రతి రైతుకు ప్రత్యేక ఫార్మర్ ఐడీ కేటాయించనున్నట్లు వివరించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యవసాయ పథకాలు సులభంగా పొందవచ్చని చెప్పారు. పీఎం కిసాన్ పథకానికి ఫార్మర్ ఐడీ తప్పనిసరి అని, రైతు వివరాలు ఖచ్చితంగా నమోదు కావడం వల్ల పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. భీమా, సబ్సిడీలు, రుణాలు, ఇతర ప్రభుత్వ పథకాల లబ్ధి త్వరగా అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఒకే ఐడీ ద్వారా లబ్ధి నేరుగా బ్యాంక్ ఖాతాలోకి జమ అవుతుందని, భవిష్యత్తు పథకాల ప్రయోజనాలు సులభంగా పొందవచ్చని, స్పష్టమైన గుర్తింపుతో మోసాలు తగ్గుతాయని తెలిపారు. రైతు రిజిస్ట్రేషన్‌కు ఆధార్ కార్డు నెంబర్, భూమి పాసుబుక్ వివరాలు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నెంబర్ తప్పనిసరిగా అవసరమని స్పష్టం చేశారు. ఫార్మర్ రిజిస్ట్రీని వ్యవసాయ విస్తరణ అధికారి కార్యాలయం లేదా మీ సేవ కేంద్రాల్లో నమోదు చేయించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో గ్రామ రైతులు పిసాటి బాల్ రెడ్డి, ఏనుగు లింగారెడ్డి, ఊదరి నరేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# అధికారం ఉన్నా లేకున్నా పార్టీ కోసం నిబద్ధతతో పని చేశా..

- అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీతోనే ప్రయాణం
- 12వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిత్వానికి విజ్ఞప్తి
- చెరుకు లింగస్వామి గౌడ్

చౌటుప్పల్, జనవరి 27 (తొలివెలుగు): కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా పార్టీ కోసం అహర్నిశలు నిబద్ధతతో పనిచేశానని కాంగ్రెస్ పార్టీ మాజీ చౌటుప్పల్ పట్టణ అధ్యక్షుడు చెరుకు లింగస్వామి గౌడ్ అన్నారు. మంగళవారం చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తనకు ఊహ వచ్చిన నాటి నుంచే కాంగ్రెస్ పార్టీపై అపారమైన అభిమానముందని తెలిపారు. తన తండ్రి చెరుకు యాదయ్య కాంగ్రెస్ పార్టీలో సీనియర్ కార్యకర్తగా కొనసాగుతూ చిన్ననాటి నుంచే పార్టీ పట్ల తనలో చైతన్యం నింపినట్లు గుర్తు చేశారు. 2007 నుంచి 2009 వరకు యువజన కాంగ్రెస్ పట్టణ ఉపాధ్యక్షుడిగా, 2009 నుంచి 2014 వరకు యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించినట్లు తెలిపారు. 2014 నుంచి నేటి వరకు రాజీవ్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నట్లు చెప్పారు. అప్పటి నల్లగొండ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నాయకత్వంలో పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నానని తెలిపారు. 2009లో భువనగిరి ఎంపీగా పోటీ చేసిన నాటి నుంచి ప్రస్తుత మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రాజకీయ ప్రస్థానాన్ని అనుసరిస్తూ పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. తన వార్డు నుంచి గతంలో రిజర్వేషన్ కారణంగా



అవకాశం రాలేదని, ప్రస్తుతం బీసీ జనరల్ కావడంతో 12వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా బరిలోకి దిగాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. పార్టీ కోసం రెండు దశాబ్దాలకు పైగా నిబద్ధతతో పనిచేసిన కార్యకర్తకు అవకాశం కల్పించి తనను నాయకునిగా తీర్చిదిద్దాలని కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని కోరారు.

# నిబంధనలు పాటిద్దాం.. సురక్షితంగా ప్రయాణిద్దాం

- హెల్మెట్‌తోనే ప్రాణ రక్షణ: ట్రాఫిక్ సీఐ విజయ్ మోహన్
- చౌటుప్పల్‌లో వాహనదారులకు ఉచిత హెల్మెట్ల పంపిణీ

చౌటుప్పల్, జనవరి 27 (తొలివెలుగు): ట్రాఫిక్ భద్రతలో భాగంగా వాహనదారులకు ఉచితంగా హెల్మెట్ల పంపిణీ కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ చౌటుప్పల్ సేవ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. బొబ్బిళ్ళ మురళి ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ ట్రాఫిక్ సీఐ విజయ్ మోహన్ విజయ్ మోహన్ చేతుల మీదుగా హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ విజయ్ మోహన్ మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ భద్రతా నిబంధనలు పాటిస్తూ ప్రయాణం చేయాలని సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుండా రోడ్లపై ప్రయాణించకూడదని తెలిపారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం ప్రాణాపాయానికి దారితీస్తుందని హెచ్చరించారు. ట్రాఫిక్ భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ చౌటుప్పల్ సేవ సభ్యులను అభినందించారు. ఈ



కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించిన బొబ్బిళ్ళ మురళిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చౌటుప్పల్ సేవ అధ్యక్షుడు తిరందాసు జగన్నాథం, ప్రధాన కార్యదర్శి అతార్ పాషా, డిస్ట్రిక్ట్ కమిటీ సభ్యులు గోశిక కరుణాకర్, ఉప్ప ఆంజనేయులు, కాసుల వెంకటేశం, వనం రాజు, సూరోజు సత్యనారాయణ, చింతల ప్రభాకర్ రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ సైదిరెడ్డి, ఏఎస్ఐ కాంట్రగడ్డ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కళ్యాణోత్సవం

- 40వ వార్షిక మార్కండేయ స్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణ
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- రథోత్సవం, ఉత్సవ మూర్తుల ఊరేగింపుతో ముగింపు

చౌటుప్పల్, జనవరి 27 (తొలివెలుగు) : చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ శివభక్త మార్కండేయ స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న 40వ వార్షిక శ్రీ మార్కండేయ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం రాత్రి శ్రీశ్రీశ్రీ పార్వతీ పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పద్మ బ్రాహ్మణుల మంత్రోచ్చారణల మధ్య భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల విగ్రహ సమర్పకులు స్వర్గీయ సూరేపల్లి శంకరయ్య – లలిత దంపతుల కుమారులు సూరేపల్లి వేణు శైలశ్రీ – శివ పావని దంపతుల సౌజన్యంతో, దేవస్థానం అధ్యక్షులు బడుగు జయప్రకాష్ – పావని దంపతులు, ప్రధాన కార్యదర్శి గోశిక బాలనరసింహ – సరిత దంపతుల ఆధ్వర్యంలో కళ్యాణోత్సవం కన్నుల పండువగా సాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. బ్రహ్మోత్సవాల చివరి రోజైన మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు స్వామివారి రథోత్సవం నిర్వహించారు. అనంతరం శ్రీ భావన ఋషి భద్రావతి దేవి, శ్రీ పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను భక్తజన సందర్శనార్థం శ్రీ భావన ఋషి కళానికేతన్ భజన మండలి ఆధ్వర్యంలో చౌటుప్పల్ పట్టణ పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఉపాధ్యక్షులు నోముల రఘునాథ్, గోశిక బాలాజీ, సహాయ కార్యదర్శి గోలి శ్రీనివాస్, కోశాధికారి బడుగు సుజాత నర్సింహ, సాంస్కృతిక కార్యదర్శి బడుగు క్రాంతి కుమార్, ప్రచార కార్యదర్శి కర్నాటి జనార్ధన్, సమన్వయ కార్యదర్శులు గుర్రం సంతోష్ కుమార్, బాల్యం అనిల్ కుమార్, ధర్మకర్తల మండలి సభ్యులు కందగట్ల బిక్షపతి, బడుగు లక్ష్మయ్య, చిక్క నరసింహ, గోశిక అంజయ్య, బడుగు శ్రీరాములు, గోశిక విఠలేశ్వర్, గుర్రం వెంకటేశం, గోశిక స్వామి, వనం ధనుంజయ, గుర్రం పాండురంగ, గోశిక నరసింహ, శ్రీ భావన ఋషి కళానికేతన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బడుగు శ్రీరాములు, గౌరవ అధ్యక్షుడు గోశిక బిక్షపతి, అధ్యక్షుడు బడుగు బాలరాజు, ఉపాధ్యక్షురాలు బడుగు సావిత్రి, ఉపాధ్యక్షుడు గంజి మార్కండేయ, ప్రధాన కార్యదర్శి పోలోజు రాజు, సహాయ కార్యదర్శి సీత తిరుమలేష్, ఆర్థిక కార్యదర్శి పోలోజు వెంకటాచారి, ప్రచార కార్యదర్శి దోర్నాల శంకరయ్య, కార్యవర్గ సభ్యులు బొబ్బలి సింహాచలం, కోణం వినోద, ధార హరికుమార్, మార సంగమేశ్వర్, బడుగు చరణ్ తేజ, రుద్ర యాదగిరి, ముషం ప్రమీలతో పాటు దేవాలయ ప్రధాన అర్చకులు గంజి నరసింహులు బృహశర్మ, గంజి అనంత రామకిరిటీ, భరత్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





